యర్రంశెట్టి శాయి

లైజెనలు

శ్రీరామ్ ఆఫీస్‌లో నుంచి బయటి కొచ్చాడు.

తనే ఆఖరివాడు. ఆ పరీక్ష హాల్లో—మిగతా వారంతా అప్పటికే ఆన్సర్ పేపర్లు ఇచ్చేసి బయటపడ్డారు.

"ఏమోయ్ ఎలా రాశావ్?" ఆత్రుతగా అడిగాడు శంకర్రావ్.

"ఫరవాలేదు...." సంతృప్తిగా అన్నాడు శ్రీరామ్.



"అయితే ఈ సారి ఆఫీసరవడం ఖచ్చిత మన్నమాట!"

"పరీక్షలు బాగా రాసినంత మాత్రాన సెలక్టవ్వాలన్న రూలేమయినా 'ఉందేమిటి?" నవ్వుతూ అన్నాడు శ్రీరామ్.

అక్కడ నిలబడ్డ వారందరూ పరీక్ష గురించే మాట్లాడు కుంటున్నారు. వాళ్ళ మాటలు వింటూంటే అందరిలోకీ తనే గాగా పరీక్ష రాయగలిగినట్లు నమ్మకం కలిగింది శ్రీరామ్‌కి. దాంతో అతనిలో ఆశ ప్రవేశించింది. ఆనందంగా ఇంటి వేపు నడువసాగాడు. నిజంగా తను సెలక్టయితే అంతకంటే అదృష్టం ఇంకే ముంటుంది? తన జీవితమే మారిపోతుంది.

ఇప్పటి వరకూ తను అనుభవిస్తున్న బాధలన్నీ తొలగిపోతాయ్. తనకున్న సమస్యలన్నీ ఇట్టే పరిష్కార మయిపోతాయ్. అవన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో డబ్బుతో ముడిపడ్డవే.

తన పిల్లలు మంచి స్కూల్లో చేరతారు.

చెల్లాయ్ పెళ్ళికి అడ్డంకిగా ఉన్న కట్నం సమస్య తొలగిపోతుంది.

రోజూ పది కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కలేక నానా అవస్థలూ పడుతున్న తను స్కూటర్ కొనుక్కో గలుగుతాడు.

బయటి గడప దగ్గరే నిలబడి తన కోసం ఎదురుచూస్తూ కనిపించింది సావిత్రి.

"ఎలా రాశారు?" చిరునవ్వుతో అడిగింది ఆత్రుతగా.

ఆ ప్రశ్నలో ఆమె ఆశలు, కోరికలు, సంతోషాలు అన్నీ కనబడుతున్నాయ్.

"ఫస్ట్ క్లాస్‌గా రాశాను ...." నవ్వుతూ

అన్నాడు శ్రీరామ్. ఆమె కళ్ళు ఆనందంతో మెరిసినయ్—ఆమె కోరుకుంటు న్న, ఎదురు చూస్తున్న జవాబది.

ఆమె లోపలికెళ్ళి రెండునిమిషాల తర్వాత 'టీ' తీసుకొచ్చి అతనికిచ్చింది.

"పోనీలెండి! ఈసారయినా మీరు పాస యితే మన దరిద్రం వదలిపోతుంది ..."ఇంకా కలల్లోనే విహరిస్తూ అంది సావిత్రి

"చూద్దాం - ఏం జరుగుతుందో" ఆమె భుజంమీద ఆప్యాయంగా చరుస్తూ అన్నాడతను - అంతకుముందు రెండుసార్లు తను ఆ పరీక్ష రాశాడు. రెండుసార్లూ తప్పాడు. పాస యిన వాళ్ళల్లో కూడా ఇంటర్వ్యూలో ఒక రిద్దరే సెగ్గారు. ఇంటర్వ్యూలో సాధారణంగా డబ్బు, రికమండేషనన్లు ప్రాముఖ్యత వహిస్తాయ్.

అందుకే ఈ పరీక్షల గండం గట్టెక్కి వా, ఇంటర్వ్యూ గండం నుంచి బయటపడగలనన్న నమ్మకం లేదు తనకి.

మరో రెండు నెలల్లో పరీక్ష ఫలితాలు వచ్చాయ్- తమ ఆఫీసులో తనతోపాటు మరో అయుగురు పాసయ్యారు.

ఇంటర్వ్యూకోసం ఆత్రుతగా ఎదురు చూడసాగాడతను.

మరో నెలరోజుల్లో అది కూడా ముగిసింది. ఇంటర్వ్యూ జరిగిన కొద్ది రోజులకే సెలక్టయిన వాళ్ళ లిస్ట్ వచ్చింది ఆఫీస్‌కి.

అందరూ చుట్టూ మూగి ఆ లిస్ట్ చూడసాగారు.

శ్రీరామ్ దూరంగా తన సీట్లో కూర్చుని వేగంగా కొట్టుకొంటున్న గుండెలతో వారి వేపు చూడసాగాడు.

"కంగ్రాచ్యులేషన్స్ శ్రీరామ్ గారూ...." అందరూ అతని చుట్టూ మూగారు.

మొత్తం ఆఫీసుకి ఇద్దరే సెలక్టయారు.

శ్రీరామ్ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయాడు ఎందుకో నమ్మబుద్ధి కావడంలేదు.

"థాంక్యూ?" అన్నాడు అందరిష్టం మీద గొంతుపెగల్చుకుని

"థాంక్యూ చాలదు- మీరూ రాజారావ్ కలిసి పార్టీ ఇవ్వాల్సిందే...."

ఇద్దరూ కలిసి ఆఫీస్ అంతటికీ టీ పార్టీ ఇవ్వకతప్పలేదు.

ఆ ఖర్చుకి మరో సందర్భమేదయినా అయితే తనకు జ్వరం వచ్చేవేదే ఆ రోజంతా అతను మరో పనిముట్టుకోలేదు. అసలు మనసక్కడ ఉంటేగా!

ఈ వార్త పాపిత్రికెంత ఆనందం కలుగజేస్తుంది? తనవాళ్ళందరూ ఎంతగానో ఉప్పొంగిపోతారు. ఇన్నేళ్ళకి తనకు ఆర్థిక బాధలనుంచి విముక్తి కలుగబోతోంది.

"సార్! మేనేజరుగారు పిలుస్తున్నారు?" ప్యూన్ వినయంగా చెప్పాడు.

మేనేజర్ గదిలోకి నడిచాడు శ్రీరామ్.

"కంగ్రాచ్యులేషన్స్ మిస్టర్ శ్రీరామ్...." అన్నాడు మేనేజర్.

"థాంక్యూసర్"

"అన్నటు మీకు రిక్వస్ట్. పి. ఏ. - వైఫ్‌కు వంట్లో బాగుండలేదని శెలవు తీసుకున్నాడు. నేను ఎల్లుండి హైద్రాబాద్ కాన్ఫరెన్స్‌కి వెళ్ళాలి. కనుక ఈ ఒక్కసారికి మీరు వస్తే హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది.

"తప్పక వస్తానండి!"

"థాంక్‌యూ...."

శ్రీరామ్ బయటికొచ్చేశాడు.

ఆ రెండోరోజు జీప్‌లో మేనేజర్‌తోపాటు హైద్రాబాద్ చేరుకున్నాడుతను. రెండు రోజులు కాన్ఫరెన్స్‌తో చాలా హడావుడిగా గడిచిపోయింది. ఆ మర్నాడే తిరుగుప్రయాణం. ఆరాత్రికి మేనేజర్లు కొంతమంది తమ మేనేజర్ ఉన్న హోటల్‌కొచ్చారు. అతని గదిలోనే డ్రింక్స్ పార్టీ జరిగింది.

సర్వర్లనుపిలవడం—వారందరికీ కావలసిన డ్రింక్స్, తినుబండారాలూ, భోజనాదులూ ఏర్పాటు చేయడంలో—తీరిక లేకుండా ఐంది. శ్రీరామ్‌కి.

రాత్రి పదకొండవుతోంది. నిద్ర ముంచుకొస్తున్నా తమాయించుకుని వారినే గమనిస్తూ కూర్చున్నాడతను. వారు ఎంత బలవంతం చేసినా తాగటం ఇష్టంలేక పోయింది తనకి. మరి కొద్ది రోజుల్లో మేనేజర్ అయ్యాక అప్పుడు కంపెనీ కోసం ఎలాగూ తప్పదు.

"ఏమోయ్ రాజూ! నీకు రీజనల్ మేనేజర్ ప్రమోషన్ ఎప్పుడు వస్తుంది?" ఏవరో అడిగారు.

రాజు బాధగా అన్నాడు "ఏమో! అదే తెలీటంలేదు. ఏరోజు కారోజు ఎదుర్చూస్తూ గడుపుతున్నాను. అది వచ్చేవరకూ నరకమే అనుకో! జీతం ఏమూలకీ చాలడంలేదు. పైకి చెప్పుకోడానికి పిగ్గుగా ఉంటుంది కానీ ఈమధ్య పెట్రోల్‌కి డబ్బులేక స్కూటర్ ఇంట్లో పడేసి బస్‌లో ఆఫీస్ కెళ్ళాను కొన్నాళ్ళు. ఆర్. ఎమ్. అయితేనే గానిఈ మెస్ లోనుంచి బయట పడడం సాధ్యం కాదు. అంతవరకూ ఈ స్కూటర్ మీద ఇలా తిరగాల్సిందే. ఈ ఉద్యోగంలో కారు కొనడం, మెయింటైన్ చేయడం ఇంపాజిబుల్ ....."

నిశ్చేష్టుడయాడు. అంతవరకూ అతను కట్టుకున్న ఊహా సౌధాలను ఎవరో పడకొట్టి నట్టనిపించింది.

ఇంకో మేనేజరు అందుకున్నాడు.

"కష్టాలు మాకూ ఉన్నాయ్ నాయినా. మా అబ్బాయికి నెల్లూరులో ఆపరేషన్ చేయించాలి. అందుకు కనీసం నలభయ్ వేలు కావాలి. అప్పుచేస్తే ఈ ఉద్యోగంలో ఉండి ఈ జీవితంలో తీర్చుకోవడం చేతకాని పని. త్వరగా రీజినల్ మేనేజర్ ప్రమోషన్ వస్తే—ధైర్యంగా అంత పెద్ద మొత్తం అప్పుచేయవచ్చని చూస్తున్నాను....."

ఇంకెవరో అంటున్నారు.

"మీరింకా ఒడ్డునే ఉన్నారు. నేను ఏనాడో మునిగిపోయాను. మాచెల్లాయ్‌కి మంచి సంబంధం చూసి పెళ్ళి చేశానామధ్య. మీరు నమ్ముతారా—సరిగ్గా లక్ష ఖర్చయింది. అందులో ఎనభయివేలు అప్పు చేయాల్సివచ్చింది. ఆ అప్పు గుర్తుకొచ్చినప్పుడల్లా భోజనం సయించదు.... నిద్రపట్టదు....." శ్రీరామ్‌కి మతిపోతోంది.

మేనేజర్లు అయుండి కూడా అందరూ ఆర్థికంగా బాధ పడుతున్నారా? ఈ ప్రమోషన్ గురించి తనుకన్నకలలేమిటి—మరి పై స్థాయిలో ఉన్న—వీళ్ళు అనుభవిస్తోన్న దేమిటి? తనకన్నా దారుణమయిన సమస్యల్లో ఇరుక్కుని ఉన్నారే! మరో ప్రమోషన్ వస్తేగాని తమసమస్యలకు జవాబు దొరకదన్న ఆశతో ఎదుర్చూస్తున్నారు.

తనకున్న సమస్యలకు తను ఆఫీసరవడమే పరిష్కారమని తననుకున్నాడు. వాళ్ళకున్న సమస్యలకు అంతకంటే పెద్ద హోదాలో కెళ్ళడమే పరిష్కారమని వాళ్ళనుకుంటున్నారు.

అశాంతిగా ఆగదిలోనుంచి బయటికొచ్చాడు శ్రీరామ్.

గది బయటే స్టూల్ మీద కూర్చుని ఏదో పుస్తకం దీక్షగా చదువు తున్నాడు ప్యూన్ శివరావు.

"ఏమిటోయ్ చదువుతున్నావ్?" అడిగాడు శ్రీరామ్.

"వచ్చేనెలలో డిపార్ట్‌మెంట్ పరీక్షలు న్నాయ్ కదండి! ఇదే ఆఖరిఛాన్స్! ఈ సారి కూడా పాస్ కాకపోతే—ఇంక బ్రతకడం కంటే చావడం మంచిది..." నిస్పృహతో అన్నాడతను.

"అదేమిటి?"

"లేకపోతే ఈ బెత్తెడు తోక జీవితంతో ఎన్నాళ్లుసార్ చావడం? అటెండర్ ప్రమోషన్ దొరుకుతేగానీ సంసారం కుదుట పడదు. లేకపోతేఒక పూట భోజనంతో చావాల్సిందే ....అంటాకా ఎందుకండి—మా ఇంటి నుంచి ఆఫీసుకి ఎనిమిది కిలోమీటర్లు దూరం. పదేళ్ళ నుంచి నడిచిరావడం—పోవడం—సైకిల్ కొనాలంటే నా వల్ల కావటం లేదు...."

శ్రీరామ్ ఇంక అక్కడ నిలబడలేక పోయాడు.

అతనికి నవ్వువస్తోంది.

శివరావ్ సైకిల్ కొనగలుగుతే చాలనుకుంటున్నాడు.

తను స్కూటర్ కావాలన్న ఆశతో ఉన్నాడు,

తనమేనేజరు కారు కొనలేకపోతున్నందుకు చింతిస్తున్నాడు.

ప్యూన్ శివరావ్, తనూ, మేనేజరూ—అందరూ పై అంతస్తులకు నిచ్చెన లేస్తున్నవారే! పై మెట్టు కెక్కడానికి ప్రయత్నాలు చేస్తున్నవారే!

మనిషి జీవితాన్ని సారవంతంచేసేవి ఆ నిచ్చెనలే! అవి లేకపోతే జీవితం తన ఆకర్షణని కోల్పోతుంది.